

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి సోమవారం 16-03-2026 సంపుటి: 01 సంచిక : 271 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Monday, 16-03-2026 Volume :01 Issue: 271 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను




Contact Number 9059328777



# మోగిన ఎన్నికల నగారా


## నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి అసెంబ్లీ ఎన్నికలు

- తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి ఎన్నికలకు ఈసీ షెడ్యుల్ విడుదల
- పశ్చిమ బెంగాల్‌లో రెండు విడతలు
- మిగిలిన రాష్ట్రాల్లో ఒకే దశలో పోలింగ్
- ఆరు రాష్ట్రాల్లో ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో ఉప ఎన్నిక

న్యూఢిల్లీ , మార్చి 15 (నేటి దర్శిని)
దేశంలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. తమిళనాడు, కేరళం పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తోందని సీఈసీ తెలిపింది.

-మిగతా 2 లో








# నేను చనిపోలేదు..

- నేను బతికే ఉన్నాను అంటూ వీడియో రిలీజ్ చేసిన ఇజ్రాయల్ ప్రధాని నెతన్యాహు
- కేఫ్ లో కాఫీ తాగుతూ కనిపించిన నెతన్యాహు
- దేశం కోసం ప్రాణాలైనా అర్పిస్తానని వెల్లడి

న్యూఢిల్లీ
ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం జరుగుతోంది. ఒకరిపై మరొకరు మిస్సైళ్ల వర్షం కురిపించుకుంటున్నారు. అయితే, 3 వారాలుగా యుద్ధం జరుగుతున్నా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కనిపించకపోవడంతో ఆయన ఉనికిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇరాన్ జరిపిన దాడుల్లో నెతన్యాహు చనిపోయారనే ప్రచారం సోషల్ మీడియాలో ముమ్మరంగా జరిగింది. కొన్ని రోజులుగా నెతన్యాహు ఎక్కడా కనిపించకపోవడంతో అనుమానాలు మరింత పెరిగిపోయాయి. ఈ క్రమంలో నేను చనిపోలేదు అంటూ స్వయంగా నెతన్యాహు రిలీజ్ చేసిన వీడియో వైరల్ గా మారింది.ప్రధాని నెతన్యాహు చనిపోయారనే వార్తలను ఇజ్రాయెల్ ఖండించిన సంగతి తెలిసిందే. తాజాగా నెతన్యాహు ఒక వీడియో రిలీజ్ చేశారు. టెల్ అవీవ్‌లోని ఓ కేఫ్‌లో కాఫీ తాగుతూ ఆయన కనిపించారు. ఈ వీడియో ద్వారా తనపై వస్తున్న వదంతులను తిప్పికొట్టారు నెతన్యాహు. అంతేకాదు తాను కాఫీ కోసం చనిపోతాను అంటూ ఫన్నీగా రిప్లయ్ ఇచ్చారాయన. నెతన్యాహు చనిపోవడంతో ఇజ్రాయెల్ ఆయన ఏఐ వీడియో రిలీజ్ చేసిందని, అందులో చేతికి 6 వేళ్లు ఉన్నాయన్న ప్రచారం జరిగింది. దీనిపైనా నెతన్యాహు

-మిగతా 2 లో



# తమిళనాట హీరో విజయ్‌కు బీజేపీ ఆఫర్?

- 80 సీట్లు.. ఉపముఖ్యమంత్రి పదవి!
- అదేమీ లేదంటున్న టీవీకే వర్గాలు
- అన్నాడీఎంకే నేత పళనిసామిదీ అదే మాట

చెన్నై,
అసెంబ్లీ ఎన్నికల వేళ తమిళనాడు రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఎన్‌డీఏతో పొత్తు లేనేలేదని సినీ హీరో, టీవీకే అధినేత విజయ్ పదే పదే చెబుతున్నప్పటికీ.. బీజేపీ, టీవీకే మధ్య చర్చలు సాగుతున్నాయని.. అవి తుది అంకానికి చేరుకున్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. మొత్తం రాష్ట్ర అసెంబ్లీ స్థానాల సంఖ్య 234 కాగా.. టీవీకేకు 80 ఇస్తామని.. విజయ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తామని బీజేపీ ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ఆయన సీఎం పదవి కోరుతున్నారని, చర్చల్లో ఇదే కీలకంగా మారినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పాలక డీఎంకే నేతృత్వంలోని కూటమికి, అన్నాడీఎంకే సారథ్యంలోని ఎన్డీఏకి మధ్య గట్టి పోటీ ఉందని.. ఓట్ల శాతంలో కాస్త తేడా వచ్చినా ఎన్నికల ఫలితాలు తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా ఉండేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని.. విజయ్‌తో పొత్తుకు తెరవెనుక వివిధ మార్గాల్లో పనిచేస్తోందని అంటున్నాయి. ఈ వార్తలు విజయ్‌కు

-మిగతా 2 లో

# డ్రగ్స్ పరీక్షలకు సిద్ధం

- మాదకద్రవ్యాలు మనుషులను రాక్షసులుగా మారుస్తాయి :
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ , మార్చి 15 (నేటి దర్శిని)
డ్రగ్స్ పరీక్షలకు తాను సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. మొయినాబాద్ ఫాం హౌస్ మాదక ద్రవ్యాల కేసు సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై వచ్చిన ఆరోపణ నేపథ్యంలో ఆయన స్పందించారు. మాదకద్రవ్యాలు మనుషులను రాక్షసులుగా

-మిగతా 2 లో

# నేటి నుంచి అసెంబ్లీ

- ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్
- 20న రాష్ట్ర బడ్జెట్



హైదరాబాద్ , మార్చి 15 (నేటి దర్శిని)
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. రెండు రోజులపాటు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించనున్నారు. 20న డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. శాసనమండలిలో ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు.

-మిగతా 2 లో

# మరో జలసంధి మూసివేత?

- ఇరాన్‌కు మద్దతుగా యుద్ధంలోకి దిగేందుకు సిద్ధమవుతున్న హౌతీ గ్రూపు
- ట్రిగ్గర్‌పై వేళ్లు సిద్ధంగా ఉన్నాయని ప్రకటన
- 'బాబ్ ఎల్-మన్‌దెబ్' జలసంధిని దిగ్బంధించేందుకు యత్నించే అవకాశం

న్యూఢిల్లీ,
ఇప్పటికే హోర్ముజ్ జలసంధి మూసివేతతో ప్రపంచ వాణిజ్యం తలకిందులవుతోంది. వాణిజ్య నౌకలు ఎక్కడివక్కడ నిలిచిపోవడంతో చాలా దేశాల్లో ఇంధన సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి తరుణంలో వాణిజ్యపరంగా మరో కీలక జలసంధి 'బాబ్ ఎల్-మన్‌దెబ్' మూసివేతకు రంగం సిద్ధమవుతున్నట్లు జరుగుతున్న ప్రచారం ఆందోళన కలిగిస్తోంది. అదే జరిగితే..

-మిగతా 2 లో




# క్రాస్ ఓటింగ్ చేస్తే రూ.5 కోట్లు!

- రాజ్యసభ ఎన్నికల కోసం బీజేపీ ప్రలోభాలు
- డీకే శివకుమార్ వెల్లడి



బెంగళూరు,
రాజ్యసభ ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఓటు వేయాలని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బెంగళూరులో ఉన్న ఒడిశా ఎమ్మెల్యేలకు రూ.5 కోట్ల చొప్పున ఇవ్వడానికి ప్రయత్నించారని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు.ఇది కచ్చితంగా బీజేపీ నిర్వహించిన ఆపరేషన్ లోటస్‌యేనని ఆయన విమర్శించారు. ఈ ఉదంతంలో లంచం ఇవ్వడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. క్రాస్ ఓటింగ్ కోసం నేతలను ప్రలోభ పెట్టడానికే వచ్చామని వారు అంగీకరించారని డీకే వివరించారు.




# సేవ్ తెలంగాణతో అసెంబ్లీకి!

- సభలో పోరుకు గులాబీ దళం సన్నద్ధం
- శాసనసభ, మండలిలో సర్కార్ తీరును ఎండగట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు
- సాధ్యమైనంత వేగంగా సమావేశాలు ముగించాలనే ఆలోచనతో ప్రభుత్వం
- గోదావరి జలాలు, మూసీ, సింగరేణిపై చర్చకు పట్టుబట్టనున్న ప్రధాన ప్రతిపక్షం
- రైతు భరోసా, మహిళలకు 2,500, పింఛన్లపై నిలదీసేందుకు సమాయత్తం
- 20న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి
- 30 లోపు ద్రవ్యవినిమయ బిల్లు పాస్
- ఈసారీ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక డౌటే!

హైదరాబాద్, మార్చి 15 (నేటి దర్శిని)
ఆరు గ్యారెంటీలు, గోదావరి నదీ జలాల వివాదం, మూసీ సుందరీకరణ, గాంధీ సరోవర్ ప్రాజెక్టు తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చకు పట్టుబట్టేందుకు ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది. అయితే, సాధ్యమైనంత తొందరగా అసెంబ్లీ సమావేశాలను ముగించాలన్న ఆలోచనతో అధికార పక్షం కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తున్నది. గరిష్ఠంగా 10 పని దినాల్లోనే సభను ముగించాలని అధికార పక్షం నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులోనే గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానం, రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, ద్రవ్యవినిమయ

-మిగతా 2 లో



# మద్యం కేసు'ను బదిలీ చేయడం కుదరదు

- కేజ్రీవాల్ అభ్యర్థనను తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 15 (నేటి దర్శిని)
ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. మద్యం కేసు విచారణను మరో ధర్మాసనానికి బదిలీ చేయడం కుదరదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఢిల్లీ మద్యం వ్యవహారానికి సంబంధించి సీబీఐ కేసులో

-మిగతా 2 లో



# లైఫ్ సైన్సెస్ రంగంలో 300 కోట్ల పెట్టుబడులు

- ఈ ప్రాజెక్టుతో 250 మందికి ఉద్యోగాలు: శ్రీధర్ బాబు

హైదరాబాద్,
అమెరికాకు చెందిన కేంబ్రిడ్జ్ ఐసోటోప్ లేబొరేటరీస్, స్థానిక కెమ్‌తత్వ చిరల్ సొల్యూషన్స్ సంయుక్తంగా లైఫ్ సైన్సెస్ రంగంలో అధునాతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. ఈ కంపెనీలు వచ్చే మూడేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెడతాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ ఫేజ్-4లో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 250 మందికి ఉద్యోగాలు

-మిగతా 2 లో

# మతసామరస్యంతోనే రాష్ట్ర అభివృద్ధి

## మైనార్టీల సంక్షేమానికి తమ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రభుత్వ పథకాల్లో ముస్లింలకు తగిన ప్రాధానత్య ఇస్తున్నాం
- మతాల మధ్య చిచ్చు పెట్టడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నాం
- అభివృద్ధిలో తెలంగాణను ముందుకు తీసుకెళ్దాం
- ఇఫ్తార్‌విందులో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి




హైదరాబాద్ , మార్చి 15 (నేటి దర్శిని)
సోదరభావంతో మనమందరం కలిసిమెలిసి ఉందామనీ, మతసామరస్యాన్ని పెంపొందించుకుందామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. రంజాన్ అంటే కేవలం పండుగే కాదనీ, ఆత్మశుద్ధి చేసుకునే సమయమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆదివారం సాయంత్రం ఎల్‌బీ స్టేడియంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో సీఎంతో పాటు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్,

-మిగతా 2 లో

# ద్రగ్స్ పరీక్షలకు సిద్ధం

మొదటి తరువాయి



మారుస్తాయన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు కూడా డ్రగ్స్ వాడటం దురదుష్టకరమన్నారు. ”డ్రగ్స్, అక్రమ పదార్థాల వాడకానికి నేను పూర్తిగా వ్యతిరేకం. అలాంటి వారిని రాజకీయాలతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠినంగా శిక్షించాలి. అయితే నీచమైన రాజకీయాల కోసం బీఆర్ఎస్ పార్టీని ఇలాంటి వివాదాల్లోకి లాగుతున్న తీరును నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు ఈ పరీక్షలు చేయించుకోవాలన్న మహేశ్ కుమార్ గౌడ్ సూచనను నేను స్వాగతిస్తున్నాను” అని కేటీఆర్ పేర్కొన్నారు. డ్రగ్స్ కేసులోకి నా పేరును లాగాలని చూస్తే చట్టపరమైన నోటీసులిస్తానని ఆయన హెచ్చరించారు.

# నేటి నుంచి అసెంబ్లీ

మొదటి తరువాయి



అనంతరం బడ్జెట్ పద్దులపై చర్చించనున్నారు.

**నిర్వహణ, వసతులు. భద్రతా ఏర్పాట్లు పూర్తి**

అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అసెంబ్లీ నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమయ్యారు. మండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ ముదిరాజ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మండలి కార్యదర్శి వి.నరసింహా చార్యులు, శాసనసభా కార్యదర్శి రేండ్ల తిరుపతి, సీఎస్ రామకృష్ణారావు తోపాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సభలు సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహాయ, సహకారాన్ని అందిస్తామన్నారు. సమన్వయం కోసం ప్రతి శాఖ నుంచి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామని చెప్పారు.

# నేను చనిపోలేదు..

మొదటి తరువాయి

స్పందించారు. చేతులను చూపించి కౌంటర్ ఇచ్చారు. దేశం కోసం ప్రాణాలైనా అర్పిస్తానని నెతన్యాహు తేల్చి చెప్పారు.ఈ వీడియోలో నెతన్యాహు తన రెండు చేతులను పైకెత్తి కెమెరాకు తన వేళ్లను చూపిస్తారు. మీరు నా వేళ్లను లెక్కించాలనుకుంటున్నారా? ఇదిగోండి లెక్కించుకోండి అని అందులో అనడం ఉంది. ఈ వీడియోలో ఆయన ఇజ్రాయెల్ పౌరులకు సందేశం ఇచ్చారు. “బయటకు వెళ్లి స్వచ్ఛమైన గాలిని పీల్చుకోండి, కానీ రక్షిత స్థలంలో ఉండండి. మీ మద్దతు నాకు, ప్రభుత్వానికి, ఐడిఎఫ్‌కు, మొసాద్‌కు బలాన్ని ఇస్తుంది. నేను చేయలేని పనులను మేము చేస్తున్నాము. ఈరోజు కూడా ఇరాన్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాము. మీరు నన్ను ముందుకు సాగమని చెబుతున్నారా? మీరు కూడా ముందుకు సాగండి” అని నెతన్యాహు అన్నారు.ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం 16వ రోజుకు చేరుకుంది. ఈ తరుణంలో ఈ వీడియో బయటకు వచ్చింది. గత నెలలో అమెరికా, ఇజ్రాయెల్.. ఇరాన్‌పై సంయుక్త దాడులకు దిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించారు. ఖమేనీ మృతితో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లో అమెరికా బేస్ లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. అటు ఇజ్రాయెల్ పైనా అటాక్స్ చేస్తోంది. ఇరాన్ ప్రతీకార దాడులతో మిడిల్ ఈస్ట్ లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

# తమిళనాట హీరో విజయ్‌కు బీజేపీ ఆఫర్?

మొదటి తరువాయి

అత్యంత సన్నిహితులు, సలహాదారులుగా ఉన్నవారికి కూడా మింగుడుపడడం లేదు. ఇది కొత్త పార్టీ విశ్వసనీయతపై ప్రభావం చూపుతుందని వారు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. స్వీయ ఇమేజ్‌తో రాజకీయ ప్రవేశం చేసిన విజయ్.. తమిళనాడు రాజకీయాల్లో తన పార్టీని ప్రత్యామ్నాయ శక్తిగా చూపిస్తున్నారని.. ఈ పరిస్థితుల్లో మరీ ఇంత త్వరగా ఎన్డీఏలో చేరితే.. ప్రతికూలత ఎదురుకావచ్చని వారు అంటున్నట్లు సమాచారం. మరోవైపు, విజయ్ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని మాజీ సీఎం, అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిసామి మరోసారి స్పష్టంచేశారు.

# సేవ్ తెలంగాణతో అసెంబ్లీకి!..

మొదటి తరువాయి

బిల్లును ఆమోదించడం తదితర అంశాలను పూర్తిచేయాల్సి ఉంటుందిఈ నెల 20న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి, 29 లేదా 30వ తేదీల్లో ద్రవ్య వినిమయ బిల్లు పాస్ చేయించి, సభను వాయిదా వేసే విధంగా వ్యూహరచన చేసినట్టు తెలిసింది. ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా జాప్యం, సింగరేణి బొగ్గు గనుల అవినీతి, ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తుది తీర్పు, మూసీ కూల్చివేతలు తదితర అంశాలపై సభలో బీఆర్ఎస్ నిలదీసే అవకాశం ఉన్నదని, ‘సేవ్ తెలంగాణ’ నినాదంతో బీఆర్ఎస్ సభ్యులు సభలోకి వచ్చే అవకాశం ఉన్నదని ప్రభుత్వానికి ఉప్పందటంతో ముఖ్యమంత్రి, మంత్రివర్గం అప్రమత్తమైనట్టు తెలిసింది. మార్చి 30 వరకు సభను ముగించాలని నిర్ణయించినట్టు సమాచారం.

# మోగిన ఎన్నికల నగారా

మొదటి తరువాయి

అసోం, కేరళం, పుదుచ్చేరిల్లో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇక పశ్చిమబెంగాల్ లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. తొలి విడత పోలింగ్ ఏప్రిల్ 23న, రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరుగనుంది. మే 4న నాలుగు రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. అలాగే అదే రోజు ఆరు రాష్ట్రాల్లో ఎనిమిది స్థానాలకు జరిగే ఉప ఎన్నిక ఫలితాలు కూడా వెల్లడిస్తారు.

**ముగియనున్న అసెంబ్లీల పదవీకాలం**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ పదవీకాలం 2026 మే 7తో ముగియనుంది. తమిళనాడు అసెంబ్లీ పదవీకాలం 2026 మే 10తో ముగియనుంది. పుదుచ్చేరి అసెంబ్లీ పదివీకాలం 2026 మే 15తో ముగియనుంది. అసోం అసెంబ్లీ పదవీ కాలం 2026 మే 20తో ముగియనుంది. కేరళం అసెంబ్లీ పదవీకాలం 2026 మే 23తో ముగియనుంది. ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను కూడా ఈసీ పూర్తి చేసింది. క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లో పర్యటించింది. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో కలిపి మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల కోసం 2.19 కోట్ల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ విధుల్లో మొత్తం 25 లక్షల మంది అధికారులు పాల్గొననున్నారు.

**ఆరు రాష్ట్రాల్లో ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు బైపోల్స్**

దేశంలోని ఆరు రాష్ట్రాల్లో ఖాళీ అయిన ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యుల్ విడుదల చేసింది. పోండా (గోవా),




ఉమ్రేత్ (గుజరాత్), బాగల్ కోట్, దావణగెరె సౌత్ (కర్నాటక), రాహురి, బారామతి (మహారాష్ట్ర), కొరిడాంగ్ (నాగాలాండ్), ధర్మనగర్ (త్రిపుర) నియోజకవర్గాలకు ఉప ఎన్నిక జరగనుంది. ఇందులో కర్నాటక, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఖాళీ అయిన నాలుగు స్థానాలకు ఒక విడతలోనూ, గుజరాత్, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లో ఖాళీ అయిన నాలుగు స్థానాలకు ఒక విడతలోనూ ఎన్నిక జరగనుంది.

కర్నాటక, నాగాలాండ్, త్రిపురలో నాలుగు స్థానాలకు షెడ్యూల్

గెజిట్ నోటిఫికేషన్ విడుదల: మార్చి 16 (సోమవారం)
నామినేషన్ల దాఖలు గడువు: మార్చి 23 (సోమవారం)
నామినేషన్ల పరిశీలన: మార్చి 24 (మంగళవారం)
నామినేషన్ల ఉపసంహరణ గడువు: మార్చి 26 (గురువారం)
పోలింగ్: ఏప్రిల్ 9 (గురువారం)
ఓట్ల లెక్కింపు: మే 4 (సోమవారం)

గుజరాత్, మహారాష్ట్ర, గోవాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు షెడ్యూల్

గెజిట్ నోటిఫికేషన్ విడుదల : మార్చి 30 (సోమవారం)
నామినేషన్ల దాఖలు గడువు: ఏప్రిల్ 6 (సోమవారం)
నామినేషన్ల పరిశీలన: ఏప్రిల్ 7 (మంగళవారం)
నామినేషన్ల ఉపసంహరణ గడువు: ఏప్రిల్ 9 (గురువారం)
పోలింగ్: ఏప్రిల్ 23 (గురువారం)
ఓట్ల లెక్కింపు: మే 4 (సోమవారం)

# మద్యం కేసు'ను బదిలీ చేయడం కుదరదు

మొదటి తరువాయి

కేజ్రీవాల్, సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా 23 మందిని నిర్దోషులుగా పేర్కొంటూ రౌస్ అవెన్యూ కోర్టు ఫిబ్రవరి 27న తీర్పునిచ్చింది. ఆ తీర్పును సీబీఐ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ట్రయల్ కోర్టు వ్యాఖ్యలపై జస్టిస్ శర్మ స్టే విధించారు. ఆ కేసు సోమవారం విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో కేసు విచారణను మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. “మార్చి 9న జస్టిస్ శర్మ ఎటువంటి బలమైన కారణాలు చూపకుండానే ట్రయల్ కోర్టు వ్యాఖ్యలపై స్టే విధించారు. ఈ కేసులో ఈడీ పార్టీ కానప్పటికీ పీఎంఎల్ఏ విచారణను వాయిదా వేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించడం అనుమానం కలిగిస్తోంది. గతంలో జస్టిస్ శర్మ ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పుడు సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఈ కేసులో న్యాయమూర్తికి ముందే ఏదో ఒక అభిప్రాయం ఉన్నట్లు అనుమానం కలుగుతోంది. కాబట్టి కేసును నిష్పక్షపాతంగా విచారించే మరో ధర్మాసనానికి మార్చండి” అని కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. ఆయన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ప్రస్తుత రోస్టర్ ప్రకారం ఈ పిటిషన్‌ను జస్టిస్ శర్మకే కేటాయించామని, విచారణ నుంచి తప్పుకోవాలా? లేదా? అనేది న్యాయమూర్తే నిర్ణయించుకోవాలని ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ దేవేంద్రకుమార్ స్పష్టం చేశారు. దీనిపై కేజ్రీవాల్, సిసోడియాలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# మరో జలసంధి మూసివేత?

మొదటి తరువాయి

ఇది ప్రపంచ వాణిజ్యానికి విఘాతంగా మారవచ్చు! గత రెండు వారాలుగా జరుగుతున్న ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధంలో నిశ్శబ్దంగా ఉన్న యెమెన్ కేంద్రంగా పనిచేసే మిలిటెంట్ గ్రూపు ‘హౌతీలు’ కూడా కదన రంగంలోకి దూకేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. హౌతీలు ఇరాన్ యుద్ధంపై తాజాగా కీలక ప్రకటన చేశారు. ‘ట్రిగ్గర్‌పై వేళ్లు సిద్ధంగా ఉన్నాయి. పరిణామాలకు అనుగుణంగా అవసరమైతే ఏ క్షణంలోనైనా రంగంలోకి దూకేందుకు సిద్ధంగా ఉన్నాం’ అని స్పష్టం చేశారు. ఈ మేరకు హౌతీ నేత అబ్దుల్ మాలిక్ ప్రకటన చేసినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. ఇది బాబ్ ఎల్-మన్‌దెబ్ జలసంధి దిగ్బంధనానికి దారితీయవచ్చని హెచ్చరించింది.

# మతసామరస్యంతోనే రాష్ట్ర అభివృద్ధి

మొదటి తరువాయి

హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ,సుదర్శన్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి ,అసదుద్దీన్ ఒవైసీ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ ఒబేదుల్లా కొత్వాల్, ముస్లిం మత పెద్దలు జామియా నిజామియా అమీర్ మౌలానా ముఫ్తీ ఖలీల్ అహ్మద్ సాహెబ్, మౌలానా ముఫ్తీ సయీద్ సాదిఖ్ మొహియుద్దీన్, మౌలానా రిజ్వాన్ ఖురేషి (మక్కా మస్జిద్ ఖతీబ్), మౌలానా హఫీజ్ పీర్ ఖాలిక్ అహ్మద్ సబీర్, మౌలానా ముఫ్తీ గియాస్ అహ్మద్ రషాది, మౌలానా సయ్యద్ నిసార్ హుస్సేన్, మౌలానా ఖాలిద్ సైఫుల్లా రెహ్మానీ, డా. అహ్సాన్ అలీ హమూమీ, సయ్యద్ సాదతుల్లా హుస్సైనీ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మెన్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..మైనార్టీల సంక్షేమానికి తమ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, ముస్లింలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. అజహరుద్దీన్‌కు మంత్రి పదవి, సీనియర్ నేత షబ్బీర్ అలీకి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవులు ఇచ్చామనీ, ఎనిమిది మంది మైనార్టీ నేతలకు కార్పొరేషన్ చైర్మెన్ పదవులు ఇచ్చామని వివరించారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ, బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్లు ఇచ్చి ప్రోత్సహించామని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాల్లో ముస్లింలకు తగిన ప్రాధానత్య ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రతి కార్యక్రమంలో మైనార్టీలకు సింహ భాగం ఇస్తున్నామని తెలిపారు. మైనార్టీ, మెజార్టీ అనే తేడా లేకుండా అంతా కలిసిమెలిసి దేశాన్ని ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ హయాంలో మైనార్టీలకు కాంగ్రెస ప్రభుత్వం నాలుగు శాతం రిజర్వేషన్లు కేటాయించడం వల్ల ఎంతో ముస్లిం పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారని గుర్తుచేశారు. మీ ఆశీస్సులు ప్రభుత్వానికి కావాలన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారనీ, అప్రమత్తంగా ఉంటూ కలిసి మెలసి తెలంగాణ ను ముందుకు తీసుకెళ్దామని పిలుపు నిచ్చారు. దేశంలోనే తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని హామీనిచ్చారు.

# లైఫ్ సైన్సెస్ రంగంలో 300 కోట్ల పెట్టుబడులు

మొదటి తరువాయి



లభిస్తాయని తెలిపారు. ఆదివారం సచివాలయంలో తనతో సమావేశమైన రెండు కంపెనీల సీఈవోలు పెట్టుబడులకు అంగీకరించారని చెప్పారు. “కేంబ్రిడ్జ్ ఐసోటోప్ లేబొరేటరీస్, కెమ్‌తత్వల భాగస్వామ్యం అంతర్జాతీయ కంపెనీలకు రాష్ట్రంపై ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ పెట్టుబడి ద్వారా అధునాతన కెమిస్ట్రీ, మెటీరియల్స్ రంగాల్లో రాష్ట్ర సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఈ అత్యాధునిక తయారీ కేంద్రంలో ఐసోటోప్ లేబుల్డ్ కాంపౌండ్స్ ఉత్పత్తి అవుతాయి. ప్రాజెక్టు పూర్తయితే దేశం వీటి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోగలుగుతుంది” అని శ్రీధర్ బాబు వివరించారు.

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం
www.epaper.netidarshini.com
సోమవారం 16-3-2026



# హ్యాపీ బర్త్ డే ఎమ్మెల్యే సాబ్...

- ప్రజల ప్రియతమ నాయకుడు వీర్లపల్లి శంకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు
- కొత్తూరు మున్సిపల్ కౌన్సిలర్ వీరమోని హేమ దేవేందర్ ముదిరాజ్

**షాద్ నగర్,మార్చి15 (నేటి దర్శిని ప్రతినిధి):** షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ప్రజల ప్రియతమ నాయకుడు, అభివృద్ధి పరుడు అయిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలు నియోజకవర్గమంతటా ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తూరు మున్సిపల్ కౌన్సిలర్ వీరమోని హేమ దేవేందర్ ముదిరాజ్ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సేవలు అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారి నాయకత్వం ప్రజలకు ఎంతో నమ్మకాన్ని కలిగిస్తోందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, తనపై చూపుతున్న ప్రేమాభిమానాలకు నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జండాగూడెం సుదర్శన్ గౌడ్, పత్రిక విలేఖరి మైపాల్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# మేకగూడ ప్రగతి రథసారథులకు సన్మానం

- గ్రామ పంచాయతీ సిబ్బంది అంకిత భావానికి దక్కిన గౌరవం
- స్రేవకు సన్మానం.. కష్టానికి ప్రతిఫలం:చెమట చుక్కకు దక్కిన గౌరవం..
- గ్రామ సర్పంచ్ రమావత్ మారు రాజు నాయక్
- ప్రని చేసే చేతులకు పాలకవర్గం సలాం:పంచాయతీ సిబ్బంది సేవలు మరువలేనివి: డిప్యూటీ సర్పంచ్ ఎడ్ల శ్రీశైలం



**నందిగామ, మార్చి15 ( నేటి దర్శిని ప్రతినిధి ):** గ్రామ పరిశుభ్రతే ధ్యేయంగా, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది నిజమైన 'ప్రగతి రథసారథులు' అని మేకగూడ సర్పంచ్ రమావత్ మారు రాజు నాయక్ కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మేకగూడ గ్రామ పంచాయతీ సిబ్బందిని మంగళవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రమావత్ మారు రాజు నాయక్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎండను, వానను లెక్కచేయకుండా గ్రామాన్ని సుందరంగా ఉంచుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది కృషిని గుర్తించి గౌరవించుకోవడం మన అందరి బాధ్యత అని అమే అన్నారు. డిప్యూటీ సర్పంచ్ ఎడ్ల శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి రామచందర్ నాయక్ వార్డు సభ్యుల సమక్షంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు డి.సురేష్, సాజిదా అనిఫ్, ఎన్నం స్వప్న సత్యం రెడ్డి, కుర్వ మల్లేష్, కుమ్మరి మల్లేష్, అనూష, మామిలపల్లి శ్రీశైలం, మరియు మోహన్ నాయక్ పాల్గొని గ్రామ పంచాయతీ సిబ్బందినీ సన్మానించారు.అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతామని వారు స్పష్టం చేశారు.
తమ సేవలకు గుర్తింపు లభించడం పట్ల గ్రామ పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.సన్మానం పొందిన వారిలో గ్రామ పంచాయతీ సిబ్బంది బాలరెడ్డి, రామస్వామి, గోవు నర్సింహ, శేఖర్, ఎక్బాల్, బాలరాజు, యాదయ్య, పద్మమ్మ, కృష్ణమ్మ, భాగ్యమ్మ, సత్యమ్మ మరియు ఇతర సిబ్బంది ఉన్నారు. గ్రామ పంచాయతీ డిప్యూటీ సర్పంచ్ ఎడ్ల శ్రీశైలం మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాల మేరకు 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమం సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపి తమ రెట్టింపు శక్తి తో గ్రామ పంచాయతీ కి మరిన్ని సేవలు అందిస్తాము అని ఈ సన్మానం కార్యక్రమం సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది తెలపడం జరిగింది.

# మహిళలకు సమాన హక్కులు అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుంది: డాక్టర్ కడియం కావ్య

- టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ



**ఉమ్మడి వరంగల్, మార్చి 15 (నేటి దర్శిని బ్యూరో):** మహిళలు రాజకీయాలు సామాజిక రంగాల్లో మరింత స్వరూప్ గా పాల్గొనేలా మహిళా కాంగ్రెస్ కీలక వేదిక గా నిలుస్తుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.గాంధీ భవన్‌లోని ప్రకాశం హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య ఎర్రబెల్లి స్వర్ణ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతూ మహిళల సమస్యల పరిష్కారానికి బలమైన స్వరం అవుతారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళలను సంఘటితం చేసి పార్టీని మరింత బలపర్చడంలో మహిళా కాంగ్రెస్ ముందుండాలని సూచించారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ , మహిళా కాంగ్రెస్ నాయకురాలు సునీతా రావ్ , రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నాం: ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మార్చి 15 (నేటి దర్శిని బ్యూరో):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, అదే దిశగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో 50 లక్షల వ్యయముతో నిర్మించనున్న సిసి రోడ్డు, మురికి కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన బాధ్యతని పేర్కొ న్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు అమలు చేస్తున్నామని అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో అభివృద్ధిలో ఎలాంటి వెనకడుగు ఉండదని ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నాణ్యతతో కూడిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మా శంకరుడు..అందరివాడు..

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ కాంగ్రెస్ సీనియర్ నేత కాశీనాథ్ రెడ్డి..



**షాద్ నగర్,మార్చి15 (నేటి దర్శిని ప్రతినిధి):** అందరివాడుగా, అభివృద్ధిలో అనితర సాధ్యుడుగా అందరి మన్ననలు అందుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంపూర్ణ ఆరోగ్యంతో, అత్యున్నత పదవులతో ఇంతింతై ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత టి. కాశీనాథ్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేను ప్రత్యేకంగా కలిసి ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అసెంబ్లీని అభివృద్ధి చేయడంలో దూసుకుపోతున్న ఆయనకు నిరంతరం అండగా ఉంటామని ఈ సందర్భంగా తాండ్ర కాశీనాథ్ రెడ్డి పేర్కొన్నారు..

# బహుజనుల ఆరాధ్య దైవం కాన్షీరాంకు ఘన నివాళి...




**ఆమనగల్, మార్చి15(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ పట్టణ కేంద్రంలో మాన్యశ్రీ కాన్షీరామ్ గారి 92 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ బిసి,ఎస్సి,ఎస్టి, జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు బహుజన సిద్ధాంతకర్త రాజకీయ గౌతమ బుద్ధుడు మాన్యశ్రీ కాన్షీరామ్ 92వ జయంతి ఉత్సవాలను బీసీ, ఎస్సీ,ఎస్టీ,జేఏసీ రంగారెడ్డి జిల్లా నాయకులు వంకేశ్వరం రమేష్ ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారత దేశ రాజకీయ వ్యవస్థలో పెను భూకంపాన్ని సృష్టించి సామాజిక రాజకీయ సాంస్కృతిక సమానత్వానికి పునాది వేసిన బహుజన యోధుడు మాన్యశ్రీ కాన్షీరామ్ అని కొనియాడారు మహాత్మ పూలే, చత్రపతి సాహు మహారాజు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గార్ల సిద్ధాంతాన్ని మోస్తూ బహుజనులను అధికారంలోకి తెచ్చిన మహానుభావుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు బిసి, ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆమనగల్ మండల నాయకులు ప్రవీణ్, జె.యాదగిరి,వి.శేఖర్, సురేష్, పోలే శివ, శ్రీను ,కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన


- నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి....



**ఆమనగల్, మార్చి15(నేటి దర్శిని ప్రతినిధి);** హైదరాబాదులో తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభకు నూతనంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని ఆదివారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు మల్లురవి అభినందనలు తెలియజేసి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహిస్తూ,ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.



మిడ్జిల్ మండలంలోని బోయిన్ పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రివర్యులు వాకటి శ్రీహరి మరియు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చిల్వేర్ గ్రామ సర్పంచ్ నాగరాజు గౌడ్ ఘన స్వాగతం పలకడం జరిగింది..
(నేటి దర్శిని ప్రతినిధి మిడ్జిల్ )



ఉర్కొండ మండలంలోని బొమ్మరాశి పల్లి గ్రామ ఉప సర్పంచ్ తిరుపతి గారి అబ్బాయికి అమ్మాయికి పుట్టు పంచ పుట్టు చీర కార్యక్రమంలో పాల్గొన్న బిజెపిరాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాల్గొని ఆశీర్వదించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా మండల నాయకులు పాల్గొనడం జరిగింది...
(నేటి దర్శిని ప్రతినిధి మిడ్జిల్)

# హే..బిడ్డా.. ఇది నా అడ్డా..



**షాద్ నగర్,మార్చి15 (నేటి దర్శిని ప్రతినిధి):** హే..బిడ్డా.. ఇది నా అడ్డా.. అంటూ దూకుడుగా ముందుకు కదిలారు.. తగ్గేదేలే.. అంటూ సంబరాలకు శ్రీకారం చుట్టారు.. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణ కూడలిలో హడావిడి, భారీ ఊరేగింపుల సందడి.. అందరికీ గుర్తుండి పోయే రీతిలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా ఆదివారం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నాయకులతో పాటు ముఖ్యంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ అన్నీ తానై ఈ కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా ముందుకు నడిపించారు. యువజన కాంగ్రెస్ సత్త ఏమిటో నిరూపించారు. వివిధ కార్యక్రమాలను చేపట్టి పట్టణ కూడలికి చేరుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ముందుగా ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం వాహనంపై భారీ ఊరేగింపు నిర్వహించారు. అడుగడుగునా ఎమ్మెల్యే నినాదాలతో షాద్ నగర్ కూడలి హోరెత్తింది. యువ నాయకుడు అందెమోహన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నియోజకవర్గంలో మూలల నుంచి యువ నాయకులు తరలిరావడంతో ఎమ్మెల్యే జన్మదిన కార్యక్రమం గతంలో ఎన్నడూ చూడనంత వేడుకగా భారీ జన సందోహం మధ్య జరిగింది. దీనిపై మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ స్పందిస్తూ ఇలాంటి ప్రతిఫలం ఆశించకుండా నియోజకవర్గాన్ని నిండు మనసుతో ఏలుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోసం అభిమానంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. ఏది ఏమైనా ఈ జన్మ దిన వేడుకల ద్వారా కాంగ్రెస్ లో యువ రక్తం ఉప్పొంగిన ఉత్సాహంతో ముందుకు కదలడం విశేషం..

# కుర్మేడు ముత్యాలమ్మ వనమాస మహోత్సవాలకు ఆహ్వానం




**చింతపల్లి, మార్చి 15 నేటి దర్శిని ప్రతినిధి :** చింతపల్లి మండలంలోని కుర్మేడు గ్రామంలో వెలసిన శ్రీ కుర్మేడు ముత్యాలమ్మ తల్లి వనమాస మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని గ్రామ పెద్దలు కోరారు. మహోత్సవాల భాగంగా ఆదివారం రాత్రి 8 గంటలకు గంధం ఊరేగింపు నిర్వహించనున్నారు. అనంతరం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, భజనలు, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తారు.మార్చి 16 సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామికి సింధూరాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 9 గంటలకు ముత్యాలమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకరణ మహోత్సవం, నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదం పంపిణీ చేస్తారు. ఈ వనమాస మహోత్సవాలకు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి దర్శనం పొందాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

# అలుపెరగని పోరాటం.. ఆగిపోని ప్రయాణం..



- ఇదే బిజెపి కార్యకర్త నిరంతర ధ్యేయం
- బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి




**మిడ్జిల్,మార్చి 15, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ్ మహాభియాన్ 2026"లో మండల ప్రశిక్షణ శిబిరం భాగంగా జడ్చర్ల టౌన్, మిడ్జిల్ మరియు ఊరుకొండ మండలాల కార్యకర్తలతో శిక్షణ శిబిరం రెండు రోజులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ పద్మజ, బిజెపి పాలమూరు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి , బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బ్రహ్మచారి, అయ్యగారి ప్రభాకర్, విద్యాసాగర్, బాలా త్రిపుర సుందరి మరియు మూడు మండలాల భాజపా మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ మోర్చాల అధ్యక్షులు మరియు మండల ముఖ్య కార్యకర్తలతో శిక్షణ తరగతులతో కూడిన సమావేశాలు జరిగాయి.

## హమాలి కార్మికుల హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది: మంత్రి సీతక్క



**ఉమ్మడి వరంగల్, రిమార్చి 15(నేటి దర్శిని బ్యూరో):** ప్రజాస్వామ్యంలో మంచి హోదాలో ఉన్నప్పుడు, అహంకారంతో కాకుండా ఎంత మందికి సహాయం చేస్తున్నామన్నదే ముఖ్యమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం హనుమకొండలో హమాలీ రాష్ట్ర మహాగర్జన సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. హమాలి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజా సంక్షేమ ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మన ఆచారాలకు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి మేడారం జాతరకు ప్రత్యేక నిధులు కేటాయించి అమ్మవారి గద్దెలను వైభవంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కోదండరాం ,హమాలి యూనియన్ నాయకులు, హమాలీలు పాల్గొన్నారు

# ఘనంగా కాన్షీరాం 92వ జయంతి వేడుకలు

## దేవరకొండలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో



**దేవరకొండ, మార్చి 15 నేటి దర్శిని ప్రతినిధి :** దేవరకొండ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గ్రంథాలయంలో మాన్యశ్రీ కాన్షీరాం 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు, అంబేద్కర్ వాద దళిత సంఘాల జేఏసీ నాయకుడు దళితరత్న ఎర్ర ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర ఆంజనేయులు మాట్లాడుతూ ఆధునిక భారత రాజకీయ చాణక్యుడు, సోషల్ ఇంజనీరింగ్ పితామహుడు, బహుజన సిద్ధాంతకర్తగా కాన్షీరాం సేవలను స్మరించారు. దళిత-బహుజన వర్గాల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేతగా ఆయన నిలిచారని పేర్కొన్నారు. తరతరాలుగా అణచివేతలో ఉన్న బహుజన సమాజాన్ని సంఘటితం చేసి సామాజిక సమానత్వం, సామాజిక ప్రజాస్వామ్యం లక్ష్యంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిపారని తెలిపారు. విద్య ద్వారా జ్ఞానం, జ్ఞానం ద్వారా చైతన్యం వస్తుందని, ఆ చైతన్యం సమాజంలో మన స్థితిని మార్చుకునే శక్తిని ఇస్తుందని కాన్షీరాం ప్రజలకు చాటి చెప్పారని అన్నారు. బామ్‌సెఫ్ సంస్థను స్థాపించి బహుజనులను సంఘటితం చేసి భారత రాజకీయాల్లో కొత్త దిశను చూపించిన మహనీయుడని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మూడు పర్యాయాలు బహుజన రాజ్యాధికార ప్రభుత్వాన్ని ఏర్పరచడంలో ఆయన పాత్ర కీలకమని వివరించారు. కాన్షీరాం చూపిన బాటలో విద్యార్థులు, యువత, మహిళలు, అంబేద్కర్ సిద్ధాంతవాదులు, ప్రజాస్వామిక వాదులు నడిచి బహుజన రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ నాయకుడు బుడియాపాక ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లాలో 240 ధాన్యం కొనుగోలు కేంద్రాలు: కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, మార్చి 15 (నేటి దర్శిని బ్యూరో):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరంగల్ జిల్లా పరిధిలో 240 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు .ఆదివారం వరంగల్ కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రబీ సీజన్లో 2.10 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

# పలు శుభకార్యాలలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల ప్రవీణ్ వెంకట్ రెడ్డి దంపతులు



**చింతపల్లి, మార్చి 15 నేటి దర్శిని ప్రతినిధి :** చింతపల్లి మండల పరిధిలో జరిగిన పలు శుభకార్యాలలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల ప్రవీణ్ వెంకట్ రెడ్డి దంపతులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాలకు హాజరైన వారు చిన్నారులను, నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని కే.ఎస్.వి గార్డెన్‌లో నసర్లపల్లి గ్రామానికి చెందిన జంగిటి లక్ష్మి--కృష్ణ యాదవ్ దంపతుల పుత్రిక చైత్రిక పుట్టినరోజు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మెండె మల్లేష్ కుమార్తెల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవానికి హాజరై చిరంజీవులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని పోలేపల్లి రాంనగర్ గ్రామానికి చెందిన ఈరటి జంగమ్మ--యాదయ్య దంపతుల కుమారుడు ఈరటి బిక్షం యాదవ్, సునితల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు ఆశీస్సులు అందించారు. ఇదే విధంగా గొల్లపల్లి గ్రామానికి చెందిన వాకిటి శ్రీశైలం--జ్యోతి దంపతుల కుమార్తెలు గీత, అక్షితల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో నసర్లపల్లి గ్రామ సర్పంచ్ పంబాల మాలతి వెంకటయ్య, ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ మెండె వెంకటయ్య, ఉప్పరపల్లి మాజీ సర్పంచ్ ఉజ్జయిని లక్ష్మణ్ రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కడారి మల్లయ్య, మేకల వెంకటయ్య, సిమర్ల శ్రీను యాదవ్, మల్లోజు గోపి, జిట్ట జగదీష్, చాట మల్లేష్, గడ్డం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్ పల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం





- ప్రారంభించిన రాష్ట్రమంత్రివర్యులు వాకిటి శ్రీహరి
- పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి
- మిడ్జిల్ మండల ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుబాటులోకి
- రెండేళ్లలో జడ్చర్లకు 22(33/11కే.వీ), ఒకటి 133/11కే.వీ సబ్‌స్టేషన్లు మంజూరు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి





**మిడ్జిల్,మార్చి 15,( నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామంలో రూ.3.05 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రాష్ట్ర క్రీడలు, మత్స్య శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ 33/11 కేవీ సబ్‌స్టేషన్ ద్వారా మిడ్జిల్ మండలంలోని పలు గ్రామాలకు నిరంతరాయంగా మరియు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని అన్నారు. రైతులు, గృహ వినియోగదారులు మరియు చిన్న పరిశ్రమలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి నిరంతరం సీఎం మరియు మంత్రులతో నిధుల కోసం కృషి చేస్తుంటారని మంత్రి ప్రశంసించారు. పనిచేయాలనే పట్టుదల కలిగిన నాయకుడిని జడ్చర్ల ప్రజలు ఎన్నుకున్నందుకు అదృష్టవంతులని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అలాగే మన జిల్లా వాసి అయిన సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని గుర్తు చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను కూడా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ.. మిడ్జిల్ మండల ప్రజల దీర్ఘకాలిక అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా విద్యుత్ లోడ్ తగ్గి, తరచూ ఎదురయ్యే విద్యుత్ అంతరాయాలు తగ్గి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే వరకు జడ్చర్ల నియోజకవర్గంలో మొత్తం 31 సబ్‌స్టేషన్లు మాత్రమే ఏర్పాటు కాగా, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత గత రెండు సంవత్సరాలలోనే 22 (33/11 కేవీ) సబ్‌స్టేషన్లు, అలాగే నవాబ్‌పేట్‌లో 133/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయించామని తెలిపారు. వాటిలో భాగంగా బోయిన్‌పల్లి గ్రామంలో మొదటి సబ్‌స్టేషన్‌ను మంత్రి శ్రీహరి గారు ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు.ఈ రెండు సంవత్సరాల కాలంలో జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి రూ.213 కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కొబ్బరికాయలు కొట్టేవారని, కానీ పనులు మాత్రం పూర్తి కాలేదని విమర్శించారు. తాను కొబ్బరికాయ కొడితే పని పూర్తయ్యే వరకు నిద్రపోనని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ తంగేళ్ల జ్యోతి, సూపరింటెండింగ్ ఇంజనీర్ బీమా నాయక్, డీఈ చంద్రమౌళి, ప్రసాదరావు, దినేష్ మోహన్ రావు, ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ నరేందర్ గౌడ్, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీవో గీతాంజలి, ఆర్ఐ అంబికా, బోయిన్‌పల్లి సర్పంచ్ పసుల శశికళ, ఉప సర్పంచ్ బోయ రామస్వామి, నాయకులు గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వాసురాం తండా వద్ద జరిగిన ఘోర ప్రమాదంపై ఎమ్మెల్యే బాలు నాయక్ దిగ్భ్రాంతి

- ఆసుపత్రిలో క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ
- రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఎమ్మెల్యే బాలు నాయక్





**దేవరకొండ, మార్చి 15( నేటి దర్శిని ):** ఆదివారం కొండమల్లేపల్లి నుండి చింతపల్లికి వెళ్తున్న క్రమంలో వాసురాం తండా సమీపంలో ఆటో మరియు లారీ ఢీకొన్న దుర్ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఆయన స్పందించారు. ఈ ఘోర ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ప్రమాద వార్త తెలిసిన వెంటనే తన నియోజకవర్గ పర్యటనను పక్కన పెట్టి, దేవరకొండలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఎమ్మెల్యే చేరుకున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఐదుగురు క్షతగాత్రులను ఆయన వ్యక్తిగతంగా కలిసి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తూ, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న చికిత్సపై డాక్టర్లతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు తక్షణమే అందించాలని ఆదేశించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారికి మెరుగైన వైద్యం కోసం అవసరమైతే ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గారు మాట్లాడుతూ వాసురాం తండా సమీపంలో జరిగిన ప్రమాదం అత్యంత బాధాకరమైన విషయం. ప్రాణనష్టం జరిగిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. క్షతగాత్రులకు అయ్యే వైద్య ఖర్చుల విషయంలో గానీ, బాధితుల కుటుంబాలకు అందాల్సిన ప్రభుత్వ సాయం విషయంలో గానీ నేను వ్యక్తిగతంగా పర్యవేక్షించి, వారికి న్యాయం జరిగేలా చూస్తాను అని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధిగా బాధితుల వెంటే ఉంటానని, వారి కష్టాల్లో తోడుగా నిలుస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు మరియు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట ఉండి బాధితులకు ధైర్యం చెప్పిన వారిలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు మరియు బాధిత కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు

## కొత్తపేటలో బిజినెస్ హబ్ ఇంటర్నేషనల్ నూతన శాఖ ప్రారంభం





**కొత్తపేట, మార్చి15 (నేటి దర్శిని):** యువతలో ఉన్న సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తూ వాటిని విజయ వంతమైన వ్యాపారాలుగా మార్చేందుకు లక్ష్యంగా బిజినెస్ హబ్ ఇంటర్నేషనల్ (బిఎచ్ఐ ) తమ నూతన కార్యాలయాన్ని కొత్తపేట లో బిఎచ్ఐ వ్యవస్థాపకులు సీఈఓ కట్టెల శివరాజ్, ఎండి నల్ల ఉదయ్ కుమార్, ఈడి కొమ్ముల మహేష్, బిజినెస్ స్ట్రాటజిస్ట్ మేదరి శివన్, చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ దుర్గం సంజీవ్ లు ముఖ్య అతిథులుగా హాజరైన బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి (విఆర్ఎస్) యాదగిరి, వాలీబాల్ సెలక్షన్ కమిటీ సభ్యుడు అండ్ వ్యాపారవేత్త వెంకటేష్, రిటైర్డ్ డిప్యూటీ ఇంజనీర్ అశోక్, నల్గొండ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రం, కెమిస్ట్ రవి లతో కలిసి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బిజినెస్ హబ్ ఇంటర్నేషనల్ అనేది కేవలం ఒక సంస్థ పేరు మాత్రమే కాదని యువతలో ఉన్న ఆలోచనలను వెలికితీసి, వాటికి సరైన మార్గదర్శకత్వం అందించి భవిష్యత్తును నిర్మించే ఒక వేదిక అని అన్నారు . చాలా మందికి మంచి వ్యాపార ఆలోచనలు ఉన్నప్పటికీ ఎక్కడ ప్రారంభించాలి, ఎలా అభివృద్ధి చేయాలి అనే స్పష్టత లేకపోవడం వల్ల అవి ముందుకు సాగలేవు. ఈ లోటును తీర్చేందుకు బిజినెస్ హబ్ ఇంటర్నేషనల్ సరైన మార్గదర్శకత్వం, మెంటర్‌షిప్ సహకారం అందించనుందని తెలిపారు.ఈ వేదిక ద్వారా యువ పారిశ్రామికవేత్తలకు ఆలోచన అభివృద్ధి, బిజినెస్ ప్లానింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ వ్యూహాలు, టీమ్ నిర్మాణం వంటి అంశాల్లో నిపుణుల మార్గదర్శకత్వం అందించబడుతుందని సూచించారు. అదేవిధంగా, వ్యాపార ఆలోచనలకు అవసరమైన పెట్టుబడులను పొందేందుకు ఇన్వెస్టర్లతో అనుసంధానం కూడా కల్పించబడుతుందని తెలిపారు. వ్యాపార అవసరాలను బట్టి సరైన పెట్టుబడిదారులతో కలిపి వ్యాపార అభివృద్ధికి దోహదం చేస్తుందని ఇదే కాకుండా, ఇతర సంస్థలు వ్యాపార వేత్తలతో నెట్‌వర్క్ ఏర్పరచి వ్యాపారాల అభివృద్ధికి సహకారం అందించబడుతుందిని తెలిపారు. ఈ కార్యక్రమం లో పలువురు పెట్టుబడి దారులు బిఎచ్ఐ తో కలిసి పనిచేస్తున్న వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసిన కాలనీ అసోసియేషన్ సభ్యులు

- లో ప్రెషర్ వల్ల నీటి సమస్యలు... వెంటనే చర్యలకు ఎమ్మెల్యే ఆదేశాలు
- కాలనీల నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హామీ



**హయత్‌నగర్,మార్చి15 (నేటి దర్శిని):**
హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సుష్మా సాయి నగర్, హుడా సాయి నగర్, ఆటో సాయి నగర్ కాలనీల అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులు ఎల్‌బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గత ఒక నెల రోజులుగా లో ప్రెషర్ కారణంగా కాలనీల్లో తీవ్రమైన మంచినీటి సమస్యలు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వెంటనే స్థానిక వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్‌కు ఫోన్ చేసి, సిబ్బందితో కలిసి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు గుత్తా లక్ష్మారెడ్డి, రమణారెడ్డి, మహేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మల్లారెడ్డి, సుదర్శన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూట్రిషన్ సభ్యులు ఆధ్వర్యంలో పెళ్లిరోజు వేడుకలు



వార్డు సభ్యురాలు పి.సరిత కృష్ణ.. కుటుంబ సభ్యులు



- వార్డు సభ్యురాలు పి.సరిత కృష్ణ గార్లకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసిన న్యూట్రిషన్ సభ్యులు

**మిడ్జిల్, మార్చి 15, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు 4.వ వార్డు సభ్యురాలు పి. సరిత కృష్ణ గార్లకు వారి వివాహ వార్షికోత్సవ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన న్యూట్రిషన్ సభ్యులు తోటి ఆత్మీయులు మిత్రులు మాట్లాడుతూ.,జీవిత ప్రయాణంలో ఇద్దరు వ్యక్తులు ఒక్కటై, పరస్పర విశ్వాసం, ప్రేమ, అర్థం చేసుకునే మనసుతో ముందుకు సాగడం అనేది ఒక అందమైన అనుబంధం. ఆ అనుబంధానికి ప్రతీకగా నిలిచిన మీ దాంపత్య జీవితం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది. మీరు వృత్తిపరంగా సాధించిన విజయాలు, సమాజానికి అందిస్తున్న సేవలు, నిర్మాణ రంగంలో చూపిస్తున్న నైపుణ్యం ఇవన్నీ మీ వ్యక్తిత్వానికి ప్రతిబింబాలు. కానీ వాటికంటే గొప్పది మీ కుటుంబ విలువలు, పరస్పర గౌరవం, ప్రేమతో నిండిన మీ దాంపత్య జీవితం. మీ ఇద్దరి మధ్య ప్రేమ మరింత బలపడాలని, ఆరోగ్యంగా, ఆనందంగా, ఐశ్వర్యంతో, సంతోషంతో ఇంకా ఎన్నో సంవత్సరాలు ఇలాంటి పెళ్లిరోజులను జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నాము. మీ జీవితం ఎల్లప్పుడూ నవ్వులతో, సంతోష క్షణాలతో నిండిపోవాలి. మీ దాంపత్య జీవితం చిరస్థాయిగా సుఖశాంతులతో కొనసాగాలని కోరుకుంటూ...
మీ ఆత్మీయ మిత్రులు..

## కమలానగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో మదన్ రెడ్డి ప్యానెల్ విజయం





**ఎల్బీనగర్, మార్చి15 (నేటి దర్శిని):**
కమలానగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్సాహంగా నిర్వహించగా, పాత–కొత్తల మేళవింపుతో పోటీ చేసిన మదన్ రెడ్డి ప్యానెల్ విజయం సాధించింది. కుర్చీ గుర్తుకు ఓటు వేసిన కాలనీ నివాసితులు సుమారు 40 నుంచి 50 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి ప్యానెల్‌పై విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మదన్ రెడ్డి ప్యానెల్‌కు చెందిన మొత్తం 9 మంది సభ్యులు గెలుపొందారు. కాలనీ ప్రెసిడెంట్‌గా గోకుల మదన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందిన ఇతర సభ్యులు: మిర్యాల గణేశ్వర రావు -- వైస్ ప్రెసిడెంట్, అయ్యవారి పుష్పాంజలి -- వైస్ ప్రెసిడెంట్, తుమ్మల సుబ్బారావు –జనరల్ సెక్రటరీ, తవుటం సంగ్రామ్ – జాయింట్ సెక్రటరీ, బోయిని లక్ష్మి (అర్చన) -- జాయింట్ సెక్రటరీ, జక్కిడి సునీత రెడ్డి -- ఆర్గనైజింగ్ సెక్రటరీ, దంతురి వెంకటేష్ గౌడ్ -- ఆర్గనైజింగ్ సెక్రటరీ, చౌదరి దివాకర్ లింగం – ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. కొత్త కమిటీ కాలనీ అభివృద్ధి, శుభ్రత, మౌలిక వసతుల మెరుగుదల కోసం కృషి చేస్తామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు అని తెలియజేశారు.

## కామినేని చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభించిన టీపీసీసీ సభ్యుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి



**మన్సూరాబాద్, మార్చి 15 (నేటి దర్శిని):**
మన్సూరాబాద్ పరిధిలోని కామినేని చౌరస్తాలో భగత్ సింగ్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో రహదారి బాటసారుల దాహాన్ని తీర్చడం గొప్ప మానవత్వానికి నిదర్శనమని అన్నారు. ఆటో కార్మికులు తమ స్వంత నిధులతో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయాలనే భావనతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన ఆటో కార్మికులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు జక్కిడి సత్య తేజ్ రెడ్డి, శ్యామల్ రెడ్డి, రాజశేఖర్, మున్నా, జానీ, రాజు, విట్టల్ రెడ్డి తదితరులు మరియు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి: ఎమ్మెల్యే

- బాధిత కుటుంబాలకు ఎల్‌ఓసి కాపీలను అందజేసిన ఎమ్మెల్యే

**ఉమ్మడి వరంగల్, మార్చి 15 (నేటి దర్శిని బ్యూరో):**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ ఏనుమాముల సాయి గణేష్ కాలనీ కి చెందిన కడమంచి దీక్షిత అనారోగ్య సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 5లక్షల రూపాయల విలువైన ఎల్ వో సి కాపీని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి మండలం దౌలత్ నగర్ బాజీ తండా చెందిన మాలోత్ పరమేష్ అనారోగ్యంతో బాధపడుతున్నారు .ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని బాధిత కుటుంబానికి 5 లక్షల



విలువైన ఎల్‌ఓసిని బాధ్యత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. వర్ధన్నపేట నియోజకవర్గం కల్లెడ గ్రామానికి చెందిన చెన్నూరి సోమయ్య అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన 2.5 లక్షల విలువైన ఎల్ ఓ సి కాఫీని ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదల వైద్య అవసరాల విషయంలో అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, స్థానిక శాసనసభ్యుడిగా తన దృష్టికి వచ్చే ప్రతి అనారోగ్య సమస్యపై తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తూ, లక్షల రూపాయలు ఖర్చయ్యే ప్రైవేట్ ఆసుపత్రుల చికిత్సలకు వెళ్లి అప్పుల పాలుకాకుండా, ప్రభుత్వ నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో తాను అందించే ఎల్ ఓ సి ల ద్వారా ఉచితంగా మెరుగైన వైద్యం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, ఆపద్కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, మార్చి15 (నేటి దర్శిని):**
స్థానిక మతసౌహార్ధాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా, ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన ప్రత్యేక ఇఫ్తార్ విందులో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. "ప్రతి మతం, ప్రతి మానవుడు సమాజంలో సౌభావాన్ని, స్నేహాన్ని పెంపొందించాలి"ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు కు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం "బి బ్లాక్" కుంట్లూరు లో శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను ఉద్దేశిస్తూ మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో ఉండే ముస్లిం సోదరులకు ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలకు ముందుగా రజాన్ పండుగ శుభాకాంక్షలు. పవిత్రమైన ఖురాన్ గ్రంథం ఆవిష్కతం అయినా సందర్భంమే రంజాన్ మాసంగా జరుపుకుంటాం అని అన్నారు. రంజాన్ అంటేనే మనకు గుర్తుకు వచ్చేది ధాత్రుత్వం, దార్మిక చింతల కలయికె రంజానం మాసం అని అన్నారు... రంజాన్ మాసం అంటే అత్యంత పవిత్రమైన మాసం. ఉదయం రోజా తో ఉపవాసం మొదలు పెట్టి పచ్చి మంచి నీళ్లు కూడా తీసుకోకుండా ఎంతో పవిత్రంగా ఉపవాసం తో మీరు ఉన్నారని అన్నారు. మిమ్మల్ని ఈ ఇఫ్తార్ విందులో కలుసుకోవాడం చాలా సంతోషం గా ఉందని మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. భారత దేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం అని హిందూ ముస్లిం లు మనదేశం లో కలిసి ఉంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారటిలకు సమూచిత స్థానం కలిపిస్తుంది తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అన్ని మతాల,కులాలా కలయిక అని అన్నారు.

## కొండమల్లేపల్లి సంతలో రైతుల పక్షాన జనసేన ధర్నా

### సదుపాయాలు కల్పించాలంటూ నిర్వాహకుడిని నిలదీశిన నాయకులు



**దేవరకొండ, మార్చి 15 నేటి దర్శిని ప్రతినిధి :**
కొండమల్లేపల్లి మండలంలోని మల్లెపల్లి సంతలో రైతులకు సరైన సదుపాయాలు కల్పించాలని కోరుతూ జనసేన పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. సంతలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ సంత నిర్వాహకుడిని జనసేన పార్టీ ముఖ్య నాయకులు చందు నాయక్, కొత్తగోల నరేష్, ఉపేందర్ నిలదీశారు. ఈ సందర్భంగా చందు నాయక్ మాట్లాడుతూ ఎటువంటి ప్రకటనలు లేకుండా, ప్రజలకు సమాచారం ఇవ్వకుండా అధికారులతో మాట్లాడి సంత వేలం నిర్వహించడం సరైంది కాదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సంత నిర్వహిస్తున్నప్పటికీ రైతులకు తగిన సదుపాయాలు కల్పించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సంతకు వచ్చే రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆవులను అమ్మినప్పుడు వెయ్యి రూపాయల చిట్టి వసూలు చేయకుండా 300 రూపాయలు మాత్రమే తీసుకుని తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సంతకు వచ్చే రైతులకు తాగునీరు, భోజనం, నీడ వంటి మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని సంత నిర్వాహకుడిని హెచ్చరించారు. లేకపోతే రానున్న రోజుల్లో రైతుల తరఫున పెద్ద ఎత్తున పోరాటాలు, ధర్నాలు నిర్వహించి సంత జరగనివ్వబోమని జనసేన పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా వందలాది మంది రైతులతో కలిసి సంత నిర్వాహకుడిపై నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తగోల నరేష్, బావండ్ల సాయి, పర్వతాలు, నవీన్, గౌస్, ఉపేందర్ తదితర జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# బాహుబలి 5 లక్షల్లో అయిపోతుంది..

## హాట్ టాపిక్‌గా రాంగోపాల్ వర్మ కామెంట్స్

ఇండస్ట్రీలో కాంట్రవర్సీస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే సెలబ్రిటీల్లో రాంగోపాల్‌వర్మ టాప్‌లో ఉంటాడని తెలిసిందే. అయితే ఏదో ఒక ట్వీట్‌తో నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచే వర్మ కొన్ని సందర్భాల్లో చేసే కామెంట్స్ అందరినీ ఆలోచింపజేయడమే కాకుండా ప్రత్యేక చర్చకు దారితీసేలా ఉంటాయి. ఇప్పుడలాంటి కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. ఇంతకీ వర్మ మాట్లాడింది ఏ టాపిక్‌పైన అనే కదా మీ డౌటు.ప్రస్తుతం మార్కెట్‌ను ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ఎలా శాసిస్తుందో తెలిసిందే. ప్రత్యేకించి ఏఐ ప్రభావం సినీ ఇండస్ట్రీపై చాలా తీవ్రస్థాయిలో పడే ప్రమాదముందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆర్జీవీ కామెంట్స్ ఇదే విషయాన్ని మూవీ లవర్స్‌కు గుర్తు చేస్తున్నాయి. పోడ్‌కాస్ట్‌లో ఆర్జీవీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏఐ స్టేటస్ ఎలా ఉందంటే.. బాహుబలి సినిమాను తక్కువ ఖర్చుల్లో తీసెయ్యొచ్చు. బలగం సినిమాను చాలా ఖర్చు అవ్వొచ్చు. దానిక్కారణ్ ఏంటంటే ఎపిక్ సెట్స్, వీఎఫ్ఎక్స్, పెద్ద పెద్ద ప్రొడక్షన్ వాల్యూస్ ఏవైతే ఉన్నాయో వాటిని అవలీలగా చేసేస్తది.. సెటిల్‌పర్‌ఫార్మెన్స్, క్యారెక్టర్స్ పర్‌పార్మెన్స్‌ను ఇప్పుడున్న పొజిషన్‌లో చేయట్లేదు. బలగంను సాధారణంగా కెమెరాలో చేసేయొచ్చు. బాహుబలి ప్రాంప్టర్‌లో చేయొచ్చు. ఖచ్చితంగా ఇదే అని కాదు. బాహుబలి సినిమా 5 లక్షల్లో అయిపోతుంది.. బలగం సినిమా రూ.2కోట్లు అవుతుంది. ఎందుకంటే బాహుబలి సినిమాను కెమెరాలు లేకుండా చేస్తం ఇప్పుడు యూఎస్‌లో పెద్ద పెద్ద సూపర్ మ్యాన్లు, స్పైడర్ మ్యాన్లు, అవెంజర్స్ తీసిన మార్వెల్ స్టూడియోస్ వాళ్లు వణికిపోతున్నారు. తీ సినిమా చేయాలంటే సీక్వెన్స్.. అది ఎంత రెజల్యూషన్‌లో వస్తుంది... ఎంత లెంగ్త్ వస్తుంది. 2 నిమిషాలు అలా వచ్చేది.. ఇప్పుడు 12 నిమిషాలు అయిపోయింది.. ఏప్రిల్ 2కు 25 మినిట్స్ అయిపోతుంది. సెప్టెంబర్ నాటికి గంట అయిపోవచ్చు. ఇంకా ముందుకు కూడా రావొచ్చు. ఫస్ట్ హాఫ్, సెకండాఫ్ గంట వచ్చిందంటే.. దాంట్లో తీసేస్తే నువ్వు ఒక ఏసీ రూంలో కూర్చొని.. ఇంక ఇండస్ట్రీ ఏంటీ..? అంటూ చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## హన్సిక హాట్ హాట్ అందాలు.. చూస్తే కళ్లు తిప్పుకోలేరు..



# కన్నడ సెంటిమెంట్.. రుక్మిణికి కలిసొస్తుందా ??

ఆ గట్టునుంటారా? ఈ గట్టునుంటారా? అంటే... ఏమో ఇప్పుడే గట్ల గురించి ఏం చెప్పలేమని అంటున్నారు రుక్మిణి వసంత్ కెరీర్‌ని గమనించిన వారు. రుక్మిణి వసంత్ తారా జువ్వలా దూసుకుపోతున్నారని అందరూ భావిస్తున్న ఈ టైమ్ లో, ఆగండాగండి.. ఒక్కసారి ఈ విషయాలను చూడండి.. ఇప్పుడు చెరెప్పండి నెక్ట్స్ సినిమాల సంగతులు అని అంటున్నారు. ఇంతకీ ఏంటా అబ్జర్వేషన్.. మనమూ మాట్లాడుకుందాం.. కాంతార చాప్టర్ 1లో రిషబ్ శెట్టి రోల్స్ ని ఎలా మర్చిపోలేమో, యువరాణి కనకవతి పాత్రలో రుక్మిణి వసంత్‌ని కూడా మర్చిపోలేం. ఆద్యంతం అందంగా కనిపిస్తూ, అంతకు మించిన ట్విస్టులతో ఆకట్టుకున్నారు రుక్మిణి వసంత్. సప్తసాగరాలు దాటి మూవీ చూసిన వారికి ఆమె మీద అదో రకమైన క్రష్ ఉండేది. అది కాంతారతో రెట్టింపయింది. అయితే కన్నడ తప్ప... ఇతర భాషలు రుక్మిణికి కలిసి రావడం లేదనే టాక్ భీభత్సంగా వైరల్ అవుతోందిప్పుడు. తమిళంలో ఆమె నటించిన మదరాసి, ఏస్ లాస్ట్ ఇయర్ రిలీజ్ అయ్యాయి. రెండు సినిమాలూ క్లిక్ కాలేదు. అలాగే తెలుగులో 2024లో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో రిలీజ్ అయింది. ఈ మూవీ కూడా ఆమెకు కలిసి రాలేదు. ప్రస్తుతం తెలుగులో తారక్‌తో కలిసి నటిస్తున్నారు రుక్మిణి. ఆమె గత రికార్డులను బట్టి ఈ సినిమా గురించి ఆలోచించాలా? లేకుంటే ఇప్పుడు కాంతార తర్వాత చేస్తున్న సినిమా కాబట్టి పాజిటివ్ వైబ్ అనుకోవాలా? నీల్ బేస్ కన్నడ కాబట్టి కచ్చితంగా క్లిక్ అవుతారనుకోవాలా? వీటిలో రుక్మిణికి ఏది కలిసొస్తుంది? తారక్ -- నీల్ సినిమాకు ఏ టాక్ ప్లస్ అవుతుంది.. ఇలాంటి ఇంట్రస్టింగ్ డిస్కషన్ జరుగుతోంది ఇండస్ట్రీలో.




# కొత్త సినిమాకు హెబ్బా పటేల్ గ్రీన్ సిగ్నల్..

## ఇంతకీ జోనర్ ఏంటో తెలుసా..?

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ హెబ్బా పటేల్. గ్లామరస్ పాత్రలతో, నటనకు ఆస్కారమున్న కథలతో ప్రేక్షకులను పలుకరిస్తూ మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. కుమారి 21ఎఫ్, ఓదెల రైల్వే స్టేషన్, హనీమూన్ ఎక్స్‌ప్రెస్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నఈ ముద్దుగుమ్మ చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తుంది. ఈ బ్యూటీ తాజాగా చిత్రాలయ క్రియేషన్స్ బ్యానర్‌పై ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ప్రొడక్షన్ నంబర్ 3గా రాబోతున్న ఈ చిత్రానికి దర్జా ఫేం మ్యాక్ (సలీం మాలిక్)దర్శకత్వం వహిస్తున్నాడు. మ్యాక్ కథ, స్క్రీన్‌ప్లే కూడా సమకూరుస్తున్నాడు. ఎమోషనల్, కామెడీ జోనర్‌లో రాబోతున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. శ్రీలక్ష్మి ఎం నిర్మిస్తున్న ఈ చిత్రానికి కేవీఆర్ అడిషనల్ స్క్రీన్ ప్లే అందిస్తుండగా.. ఎం సమీర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ మూవీకి భాష్య శ్రీ మాటలు, పాటలు సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనుంది హెబ్బా పటేల్ టీం. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూసుకెళ్తున్న హెబ్బా పటేల్ ఈ సారి సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నది ఆసక్తికరంగా మారింది.

# బాలీవుడ్‌లో మరో ఆఫర్




బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది కీర్తి సురేష్. ఆ సినిమా ఫెయిల్యూర్‌గా నిలిచినా ఈ భామ అభినయానికి మంచి మార్కులు పడ్డాయి. తాజాగా కీర్తి సురేష్ బాలీవుడ్‌లో మరో బంపరాఫర్‌ను దక్కించుకుంది. రాజ్‌కుమార్ రావుతో కలిసి ఆమె 'రాఫ్తార్' అనే చిత్రంలో నటించనుంది. ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహించనున్నారు. శనివారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది.షూటింగ్ ప్రారంభించామని, జూలైలో చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. విద్యా వ్యవస్థ నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని, ప్రేమకథకు కూడా ప్రాధాన్యత ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో కీర్తి సురేష్ పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్‌లో కనిపిస్తుందని, బాలీవుడ్‌లో ఆమె కెరీర్‌కు బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కీర్తి సురేష్ తెలుగులో విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్ధన' చిత్రంలో నటిస్తున్నది.